క్లుప్తంగా

పశువుల పెంపకంలో జాగ్రత్తలు అవసరం



పశువులకు టీకా వేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ గోపాలకృష్ణ

పాలసముద్రం: పాడి పశువుల పెంపకంలో రైతులు సరైన జాగ్రత్తలు పాటించాలని పశు వైద్యాధికారి యశస్వి తెలిపారు. సోమవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ పరిధిలో వెటర్నరీ అసిస్టెంట్ గోపాలక్రిష్ణ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాడి పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధులు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలను విధిగా వేయించాలన్నారు. అనంతరం పాడి పశువులకు ఉచితంగా టీకాలు వేసి, పిడుదుల మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో గోపాలమిత్ర నాగరాజు, పాడి రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



లీలావతిని అభినందిస్తున్న అధ్యాపకులు

పుత్తూరు: తిరుపతి శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన యువ తరంగ్–2024 అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీల్లో పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని టి.లీలావతికి బహుమతి లభించింది. బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న లీలావతి రంగోలి పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జి.కోటేశ్వరయ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా రంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో కల్చరల్ కమిటీ సమన్వయకర్త వాణిశ్రీ, వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, అధ్యాపకులు శ్రీనివాసులు, సావిత్రి, జ్యోతి, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణ



మాట్లాడుతున్న డీవైఈఓ ప్రభాకర్‌రాజు

పుత్తూరు: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం తెలుగు ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. డీవైఈఓ ప్రభాకర్‌రాజు మాట్లాడుతూ పదో తరగతి నూతన పాఠ్య బోధనాంశాలపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం శిక్షకులు నరసింహులు, పాండురంగ స్వామి, గంగాధరం మాట్లాడుతూ బోధనా విధానాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భువనేశ్వరి పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపుని వినియోగించుకోండి



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలసముద్రం: ఎమ్మార్సీ భవనంలో నిర్వహిస్తున్న ఆధార్ శిబిరాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ క్రిష్ణమహేష్‌రెడ్డి, ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం ఎమ్మార్సీ భవనంలో నిర్వహించిన ఆధార్ కార్డు క్యాంపుని వారు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో వారు మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బంది పడకుండా ఎమ్మార్సీలో ఆధార్ కార్డు క్యాంపు పెట్టామని తెలిపారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ నియామకం



కోదండరామిరెడ్డి

శ్రీరంగరాజపురం: మండలంలో ముద్దుకుప్పం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కోదండరామిరెడ్డిని ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీగా కోదండరామిరెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ జిల్లా కలెక్టర్ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం మండల అధికారులు కోదండరామిరెడ్డిని అభినందించారు.

వాల్టా చట్టానికి తూట్లు

నగరి నియోజకవర్గంలో వాల్టా చట్టానికి కొందరు తూట్లు పొడుస్తున్నా అటవీ, రెవెన్యూ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పచ్చని చెట్లపై గొడ్డలి వేటు పడుతున్నా, ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నా చోద్యం చూస్తున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 200 పైగా ఇసుక బట్టీలు ఉన్నాయి. వీటిని ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్టు తెలిసింది. ఇటుక బట్టీల నిర్వాహకులు చెట్లను యథేచ్ఛగా నరికేస్తున్నా, మట్టిని అక్రమంగా తవ్వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

– విజయపురం

- నివాస ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు
- యథేచ్ఛగా చెట్ల నరికివేత,
- ప్రభుత్వ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, అటవీశాఖ అధికారులు



గొల్లకండ్రిగ వద్ద నివాస ప్రాంతలో ఇటుక బట్టీ

విజయపురంలో 50, నగరి 40– నింద్ర 20, పుత్తూరు 100, ఇటుక బట్టీలు ఉన్నాయి. ఇవన్నీ ప్రధాన రహదారులకు ఆనుకుని ఉన్నాయి. వీటి నుంచి వచ్చే పొగతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వాల్టా చట్టం ప్రకారం నీరు, చెట్టు, భూమికి ఎలాంటి హాని జరగకూడదు. ఇటుక బట్టీలు నిర్వహించాలంటే అనుమతులు తప్పనిసరి. వాస్తవానికి నిబంధనల ప్రకారం ఏజెన్సీలో అటవీ ప్రాంతాల్లో ఇటుక బట్టీలు నిర్వహించకూడదు. ప్రస్తుతం ఇటుకలకు డిమాండ్ ఉండడం, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుండడంతో ఇటుక బట్టీలు వెలుస్తున్నాయి. అడవుల్లో కలప, కొండవాగు ప్రవాహాల సమీపంలోని ప్రభుత్వ భూముల్లోని మట్టిని బట్టీల నిర్వాహకులు దర్జాగా వినియోగిస్తున్నారు.

నిద్రమత్తులో రెవెన్యూ యంత్రాగం

ఇటుక బట్టీలు రహదారికి ఆనుకుని ఉండగా మరి కొన్ని అటవీ ప్రాంతాల్లో ఉన్నాయి. మరి కొన్ని నివాస ప్రాంతాల్లో ఉన్నాయి. నిత్యం అధికారులు చూస్తున్నా వాటిని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. వ్యాపారులు ఇచ్చే మామూళ్ల మత్తులో అధికారులు నిద్రబోతున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని ఇటుక బట్టీలను నియంత్రించాలని కోరుతున్నారు.

అడవిని తవ్వేస్తున్నారని ఆందోళన



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న యువకులు

నగరి : మున్సిపల్ పరిధి కీళపట్టు శివారులో గ్రావెల్ తవ్వకాల పేరుతో అడవి, కొండను నాశనం చేస్తున్నారని స్థానిక యువకలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం గ్రావెల్ క్వారీ ఎదుట కీళపట్టు, పెరుమాళ్‌నగర్, కావేటిపురం, నాగరాజకుప్పం, బీరకుప్పం, కన్నికాపురం, ఓజీకుప్పం, కేజీకుప్పం, నెత్తంకండ్రిగ, వీకేఆర్‌పురానికి చెందిన యువకులు ఆందోళనకు చేపట్టారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయానికి చేరిన వారు ఆర్డీఓ వై.భవానీశంకరికి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ పూర్వీకుల కాలం నుంచి తమకు జీవన ఆధారంగా ఉన్న అడవిని క్వారీ నిర్వాహకులు ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా క్వారీ యజమానులు రాజకీయ పలుకుబడితో అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అడవిలో యథేచ్ఛగా మట్టి, గ్రావెల్ తవ్వేసి ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. అటవీ ప్రాంతం చుట్టుపక్కల 11 గ్రామాలున్నాయని, సుమారు 2వేల మంది నివసిస్తున్నారని వెల్లడించారు. కొండను నాశనం చేయడంతో ఇంకుడు గుంతలు, చెరువులకు నీరు రావడం లేదని, దీంతో ఆవులు, గేదెలు, జీవాల సంరక్షణ కష్టతరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మైనింగ్‌ను అడ్డుకోవాలని కోరారు.

విద్యుత్ సమస్య పరిష్కారం



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

శ్రీరంగరాజపురం: పెద్దతయ్యూరు దళితవాడ గ్రామం విద్యుత్ ఎర్త్‌వైర్ పాడవడంతో గ్రామం మొత్తం విద్యుత్ షాక్ కొడుతోందని పరిష్కరించాలని తయ్యూరు సర్పంచ్ వరదమ్మ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. దీంతో తక్షణమే స్పందించిన కార్వేటినగరం విద్యుత్ ఏడీ చంద్రబాబు, శ్రీరంగరాజపురం ఏఈ విజయశేఖర్ పెద్దతయ్యూరు గ్రామానికి వెళ్లి పరిశీలించారు. విద్యుత్ ఎర్త్‌వైర్‌ను మార్చారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించిన విద్యుత్ అధికారులకు సర్పంచ్ వరదమ్మ, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

యువజనోత్సవాల్లో నగరి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో అధ్యాపకులు

నగరి : తిరుపతిలోని ఎస్వీయూలో నిర్వహించిన అంతర కళాశాలల యువజనోత్సవాల్లో నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభను కనబరచినట్లు ప్రిన్సిపల్ వేణుగోపాల్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జానపద నృత్యం, క్విజ్, వక్తృత్వ, కార్టూనింగ్, రంగోలి పోటీలలో బహుమతులు సాధించారన్నారు. ప్రధానంగా బీజెడ్సీ తృతీయ సంవత్సరం విద్యార్థిని యామిని రంగోలిలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. మిగిలిన విభాగాల్లో సైతం తమ విద్యార్థులు రాణించినట్లు వివరించారు. ఈ మేరకు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ భాస్కరరాజు, అరుణ కుమారి, రామాంజులు పాల్గొన్నారు.

జీవామృతంతో చీడపీడల నివారణ



జీవామృతం తయారు చేస్తున్న రైతులు

పాలసముద్రం: జీవామృతం వినియోగంతో పంటలను ఆశించే చీడపీడలను సమర్థవంతంగా నివారించవచ్చునని, ఎలాంటి రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం లేదని ప్రకృతి వ్యవసాయ విభాగం ఎల్‌సీఆర్‌పీ ప్రతాప్ తెలిపారు. సీఎం కండ్రిగలో సోమవారం జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. 100 లీటర్ల ద్రవ జీవామృతం తయారీకి 5 లీటర్ల గోమూత్రం, 5 కిలోల దేశీయ ఆవుపేడ, ఒక కిలో బెల్లం, శనగపిండి, పిడికెడు పుట్టమన్ను, 100 లీటర్ల నీటిలో కలిపి 5 రోజులపాటు ప్రతీరోజు ఉదయం, సాయంత్రం సవ్య దిశలో కలపాలని సూచించారు. అనంతరం దాన్ని వడగట్టి వచ్చిన ద్రావణాన్ని జీవామృతంగా వినియోగించుకోవచ్చన్నారు. దీన్ని మొక్కలకు వేసుకుంటే ఎలాంటి ఎరువులు, పురుగు మందులు వినియోగించాల్సిన అవసరం ఉండదన్నారు. సీఎం కండ్రిగలో రైతు నిర్మల సాగు చేసిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. జీవామృతాన్ని సాగులో ఉన్న పంటలకు ఎలా వినియోగించాలో వివరించారు. కార్యక్రమంలో మునియమ్మ, రైతులు పాల్గొన్నారు.

విధులకు హాజరు కాకుంటే చర్యలు

తిరుపతి ఎడ్యుకేషన్ : పుత్తూరు మండలం, గేట్ పుత్తూరు జెడ్పీ (తమిళ)ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(తమిళ్)గా పనిచేస్తున్న వీఎస్ బేబీ కస్తూరిబాయ్ జూన్ 25వ తేదీ నుంచి విధులకు హాజరుకావడం లేదని డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ విషయాన్ని పుత్తూరు డీవైఈఓ తమ దృష్టికి తీసుకు వచ్చినట్లు వెల్లడించారు. టీచర్ వెంటనే విధులకు హాజరుకాకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

26న ఆందోళనకు సిద్ధం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నేతలు

నగరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా ఈ నెల 26వ తేదీన ఆందోళనకు సిద్ధమైనట్లు ఏఐటీయూసీ నేతలు వి.వేలన్, షబ్బీర్‌బాషా తెలిపారు. సోమవారం ఈ మేరకు ట్రేడ్ యూనియన్లు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ సామాన్య ,మధ్యతరగతి ప్రజలు, రైతులు, కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. రబీ సీజన్‌లో రైతులకు ఉచిత పంట బీమా సౌకర్యం కల్పించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు రాజేంద్రన్, ఇంద్ర, భాస్కర్ రెడ్డి, మునిరత్నం రెడ్డి, సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

కార్యదర్శుల కొరత

- ముందుకు సాగని అభివృద్ధి పనులు

కార్వేటినగరం: ఎమ్మెల్యే సొంత మండలంలో కార్యదర్శుల కొరత వేధిస్తోంది. దీంతో ఆయా పంచాయతీల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. గత ప్రభుత్వంలో ప్రతి పంచాయతీకి కార్యదర్శి, సచివాలయ సిబ్బందితో సచివాలయాలు కళకళలాడుతూ సమస్యలపై ఎప్పటికప్పుడు పరిష్కారాలు లభించేవి. సచివాలయాలను అంచలంచెలుగా నిర్వీర్యం చేయడానికి ప్రస్తుత ప్రభుత్వం పూనుకుంది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ సొంత మండలమైన కార్వేటినగరంలో 22 పంచాయతీలు ఉండగా 14 పంచాయతీలకు కార్యదర్శులు లేరు. దీంతో ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించలేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు రెండు పంచాయతీలకు ఒక డీడీఓ ఉండడంతో కార్యదర్శులు లేని పంచాయతీల అభివృద్ధి పనులపై దృష్టి పెట్టలేకపోతున్నట్లు సమాచారం. దీనిపై ఎంపీడీఓ చంద్రమౌళిని వివరణ కోరగా 22 పంచాయతీలకు 8 మంది మాత్రమే కార్యదర్శులు ఉన్నారని తెలిపారు. 14 మంది కొరత ఉందని, ఈ విషయాన్ని ఎమ్మెల్యేతోపాటు, జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. త్వరలో ఖాళీలను భర్తీ చేస్తామని ఉన్నతాధికారులు తెలిపినట్లు ఎంపీడీఓ వివరించారు.



పంచాయతీ కార్యాలయం

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



టీచర్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వెదురుకుప్పం: మండంలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దేశమునికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. టీచర్ దేశముని అనారోగ్యంబారిన పడ్డారని పూర్వ విద్యార్థులు తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులు పుత్తూరు పురంధర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గఫార్, దాము, హేమాద్రి కలిసి సోమవారం వెదురుకుప్పం గ్రామంలోని దేశముని ఇంటికి వెళ్లి పరామర్శించారు. రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం యోగక్షేమాలపై వాకబు చేసి తాము అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు. విద్యాబుద్ధులు నేర్పిన టీచర్‌కు కృతజ్ఞతగా తాము న్నామంటూ ఆర్థికంగా సాయం చేసి బాసటగా నిలవడాన్ని పలువురు అభినందిస్తున్నారు.

రేపు ప్రదోషకాల పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎన్ కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరిపై కొలువైన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం ప్రదోష కాల పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు రమేష్ సోమవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. ఏకకాలంలో నందీశ్వరునికి, శివునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అరుణగిరిపై కార్తీక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో రెండవ కార్తీక సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలు, పెరుగు, కుంకుమ, విభూదితో అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి, భక్తిప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.అయ్యప్ప భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

ఆజాద్ సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ విజయులురెడ్డి

కార్వేటినగరం: మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయులురెడ్డి అన్నారు. సోమవారం జాతీయ విద్యా దినోత్సవం కార్యక్రమాన్ని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్, ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనుంజయరెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిగా డాక్టర్ అబ్దుల్ కలాం అజాద్ దేశంలో 14 సంవత్సరాల వయసు వరకు నిర్బంధ ప్రాథమిక విద్య అమలు చేశారని గుర్తు చేశారు. దేశ వ్యాప్తంగా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు రావడానికి ఐఐటీలు, బెనారస్ హిందూ యూనివర్సిటీ ప్రారంభం కావడానికి ఆయన ఎనలేని కృషి చేశారని చెప్పారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ వస్తారో.. లేదో?



పాలసముద్రం పోలీస్ స్టేషన్

పాలసముద్రం: మండల ఎస్‌ఐ బదిలీపై వెళ్లి నెల రోజులు అవుతున్నా పాలసముద్రం పోలీస్‌స్టేషన్‌కి తిరిగి ఎస్‌ఐను నియమించక పోవడంతో సమస్యలు ఎక్కువైపోతున్నాయి. పోలీస్ స్టేషన్‌లో అసలే సిబ్బంది కొరత ఉంది. దానికి అనుగుణంగా ఎస్‌ఐ లేకపోవడంతో గ్రామాల్లో శాంతిభద్రతల సమస్య తలెత్తుతోంది. ముఖ్యంగా మందుబాబులు రోడ్డు పక్కనే కూర్చొని మద్యం తాగుతున్నారు. రోడ్డుపై పోతున్న వారిపై గొడవలకు దిగుతున్నారు. ఉన్న సిబ్బంది పోలీస్ స్టేషన్‌కే పరిమితం అవుతున్నారు. రాత్రి సమయంలో ఎక్కడ చూసినా గుర్తు తెలియని వ్యక్తులు తిరుగుతున్నారు. ఎస్‌ఐ ఉంటే బలిజకండ్రిగ– షోలింగర్–చిత్తూరు బైపాస్ రోడ్డులో ప్రతి రోజూ వాహనాలు తనిఖీలు చేసేవారు. అలా లేకపోవడంతో ద్విచక్ర వాహనాల దొంగతనాలు ఎక్కువై పోతున్నాయి. ఇసుక మాఫియా ఎక్కువ అయిపోయింది. పోలీస్ స్టేషన్ సమీపంలో రాత్రికి రాత్రే ఇసుక టిప్పర్లు వెళ్తున్నాయి.

మందులతో క్షయ వ్యాధి నయం



బీపీ, షుగర్ పరీక్షిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం: టీబీ సోకిన వారు క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయమవుతుందని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. సోమవారం పాలసముద్రం బీసీ కాలనీలో క్షయ బాధితులతో పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు సుశీల, మురళి మాట్లాడారు. వ్యాక్సిన్ వేసుకుని మాత్రలను వాడితే వీలైనంత వరకు వ్యాధి నయమవుతుందని తెలిపారు. బీపీ, షుగర్ ఎక్కువైతే వెంటనే ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో జిల్లా కన్వీనర్

నగరి : అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐఎస్‌ఎఫ్) నగరి నియోజకవర్గం కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నిక ప్రక్రియకు ఏఐఎస్‌ఎఫ్ చిత్తూరు జిల్లా కన్వీనర్ ప్రవీణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విజయనగరంలో ఏఐఎస్‌ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టి, విద్యారంగంలోని సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జరిగిన ఎన్నికలో అధ్యక్ష, కార్యదర్శులుగా పాండ్యన్, షారూక్, ఉపాధ్యక్షులుగా దిలీప్, లక్ష్మీ ప్రసాద్, జానకిరామ్ సహాయ కార్యదర్శులుగా విఘ్నేష్, విష్ణుసాయి, విష్ణు, కోశాధికారిగా జ్యోతిరామ్, కార్యవర్గ సభ్యులుగా ఆదిత్య, మహేష్, సాయి కుమార్, నితిన్, చంద్ర, ప్రీత్వి, మహిళా కన్వీనర్లుగా మేనక, ఉమ ఎన్నికయ్యారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గంగాధరనెల్లూరు: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం జీడీ నెల్లూరు,పెద్ద కాల్వలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మానసిక ఆరోగ్యం, ప్రశాంతత, సంతృప్తి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జీడీ నెల్లూరు సర్పంచ్ సుబ్రమణ్యం, పెద్ద కాల్వ సర్పంచ్ ఏకాంబరం, పంచాయతీ కార్యదర్శులు చంద్ర, కిరణ్ కుమార్, కుమార్, చిట్టెమ్మ, శివయ్య, పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం



విజయపురం : మండలంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అప్పుడప్పుడు వచ్చే బస్సులోనే తొక్కుకుంటూ ఎక్కుతున్నారు. చివరకు బస్సు కిక్కిరిసి పోవడంతో ఫుట్‌బోర్డుపై సైతం ప్రయాణిస్తున్నారు. కాలు జారితే ప్రమాదమని తెలిసినా, చదువుకునేందుకు రిస్క్ చేయాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి అదనపు బస్సులు నడపాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

నగరి : రూరల్ మండలం, నింద్ర మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, మినీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ కె.కృష్ణవేణి కోరారు. సోమవారం ఆమె మాట్లాడుతూ నగరి మండలం గుండ్రాజుకుప్పం దళితవాడ–1(ఎస్సీ) బుగ్గఅగ్రహారం సహాయకులు–1 (ఓసీ), నింద్ర మండలంలో కీళంబాకం దళితవాడ మినీ కార్యకర్త–1 (ఓసీ), శ్రీరామపురం ఎస్టీ కాలనీ మినీ కార్యకర్త–1(ఎస్టీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన స్థానిక మహిళ దరఖాస్తుకు అర్హులని వెల్లడించారు. జూలై 1వ తేదీకి 21–35లోపు వయసు ఉండాలని చెప్పారు. దరఖాస్తుతో పాటు 10వ తరగతి మార్కుల జాబితా, ఆధార్, రేషన్ కార్డు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలను గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించి ఈ నెల 13 నుంచి 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందించాలని సూచించారు.



జీడీ నెల్లూరు సీడీపీఓ వినతశ్రీ

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గంగాధరనెల్లూరు: మండలంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న హెల్పర్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీఓ వినతశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం మాట్లాడుతూ గంగాధరనెల్లూరు మండలంలోని కలిజవేడు అంగన్‌వాడీ హెల్పర్ పోస్ట్ (ఓసీ), కోటాగరం అంగన్‌వాడీ హెల్పర్ పోస్ట్(ఎస్సీ), తిరువీధి కుప్పం అంగన్‌వాడీ హెల్పర్ పోస్ట్(ఓసీ) కేటాయించారని, ఖాళీలకు దరఖాస్తులు చేసే అభ్యర్థినులు తహశీల్దార్ కార్యాలయంలో కులం, నివాస ధ్రువీకరణ పత్రాలను, విద్యార్హత సర్టిఫికెట్లు, వికలాంగులు కలిగిన వారు సంబంధిత సర్టిఫికెట్లు జిరాక్స్‌లపై గెజిట్ అధికారితో అటేస్టేషన్ సంతకాలు చేసుకోవాలని కోరారు. అర్హులైన అభ్యర్థినులు దరఖాస్తును ఈ నెల 13వ తేదీ నుంచి 22వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా ఐసీడీఎస్ కార్యాలయంలో చేర్చాలని ఆమె కోరారు.